క్లుప్తంగా

నేడు అన్నదాత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంటగల వైఎస్సార్ సీపీ నియోజక వర్గ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అన్నదాత పోరు వాల్‌పోస్టర్ల కార్యక్రమం జరుగుతుందని కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు అన్నాబత్తుని శ్రవన్‌కుమార్, అంబటి మురళీకృష్ణలతో పాటు పలువురు జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆత్మకూరులో గణపతి నిమజ్జనోత్సవం




ఆత్మకూరు(మంగళగిరి): గ్రామంలో వినాయక చవితి సందర్భంగా కొండిన్య మహర్షి సెంటర్‌లో కొండిన్య మహారుషి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనోత్సవం శనివారం ఘనంగా జరిగింది. గ్రామోత్సవంలో గణనాథుడుని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామ్‌గోపాల్ గౌడ్ ప్రారంభించారు. కనకతప్పెట్లు, బాణాసంచా కాల్పులు, మేళతాళాలతో గణేష్ మహారాజ్‌కి జై అంటూ యువత కేరింతలతో నిమజ్జనోత్సవం నిర్వహించారు.

దోమల నిర్మూలనకు కృషి



ఫిరంగిపురం: దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని అమీనాబాద్‌లో శనివారం ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. సబ్ సెంటర్లో ఆశా కార్యకర్తలు రాసే పీడీపీ పనుల రికార్డును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామంలో పలు ప్రాంతాలకు వెళ్లి సిబ్బంది నిర్వహించే పనులను పరిశీలించారు. మహిళలకు దోమల నిర్మూలన గురించి వివరించారు. ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నీటిని నిల్వ ఉంచుకోకుండా ఉండాలని, తాగునీటి పాత్రలపై తప్పని సరిగా మూతలు పెట్టుకోవాలన్నారు. ప్రతి నాలుగు రోజులకోమారు పాత్రలను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిసరాల శుభ్రత గురించి తెలియజేయాలని చెప్పారు. బాబురావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిట్ ద్వారా ప్రయోజనాలు



దుగ్గిరాల: పరిశ్రమలలో ఉపయోగించే మెషినరీ, టూల్స్, టెక్నాలజీ గురించి పాఠశాల్లో నేర్చుకున్న వాటిని పరిశ్రమలలో ఎలా ఉపయోగిస్తున్నారో తెలుసుకోవడం వల్ల విద్యార్థులకు మరింత పరిజ్ఞానం పెరుగుతుందని వొకేషన్ ట్రైనర్ పి.ఝాన్సీ అన్నారు. శనివారం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వీఐటీ – ఏపీ యూనివర్సిటీని సందర్శించారు. హెచ్‌ఎం జనార్దన రావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో దాడి



తాడేపల్లి రూరల్: తాడేపల్లికి చెందిన ఓ మైనర్ బాలికను ప్రేమించి పెళ్లిచేసుకున్న చరణ్ కుటుంబ కలహాల కారణంగా ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం ఆ బాలికను తల్లిదండ్రులు పెనుమాకలో ఉన్న తమ ఇంటికి తీసుకువెళ్లారు. నాలుగు రోజుల క్రితం మృతుడు చరణ్ తమ్ముడు అతని స్నేహితులతో కలసి తమ ఇంటిపై దాడిచేసి వస్తువులను ధ్వంసం చేశారని శనివారం బాలిక తల్లిదండ్రులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంట్లో వున్న సామగ్రి అంతా ధ్వంసం చేసి చంపేస్తామంటూ బెదిరించారని, తమకు ప్రాణహాని ఉందని, న్యాయం చేయాలంటూ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తాడేపల్లి పోలీసులు పేర్కొన్నారు.

గణ వీడ్కోలు!

- శోభాయమానంగా గణపతి నిమజ్జనాలు
- కమనీయంగా శోభాయాత్రలు
- మారుమోగిన జై గణేశా నినాదాలు



ఊరేగింపులో వినాయకుడు



సీతారామ కోవెల నుంచి నిమజ్జనానికి బయలుదేరిన వినాయక విగ్రహం

మంగళగిరి టౌన్: అశేష భక్తగణం జేజేలు పలుకగా.. భక్తి పారవశ్యంతో వీడ్కోలు చెప్పగా... కనుల పండువగా శోభయాత్ర సాగగా... దారి పొడవునా గణపతి బప్ప మోరియా నినాదాలు మారుమోగగా... ఊరూ వాడా జనసాగరమై కదలిరాగా... నదులు, కాలువలు భక్తజన హారంలా మారిన వేళ గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకున్నారు. బొజ్జ గణపతిని 10 రోజులపాటు పూజించిన అనంతరం శనివారం మంగళగిరి పట్టణంలో భక్తిశ్రద్ధలతో గణనాథులను నిమజ్జనం చేశారు. మంగళగిరి నగరంలో గత ఏడాది కంటే ఈ ఏడాది 20 శాతం ఎక్కువ విగ్రహాలను పందిళ్లలో ఏర్పాటు చేశారు.

నిమజ్జనానికి 45 విగ్రహాలు..

మంగళగిరి నగరంలో శనివారం సుమారు 45 వినాయక విగ్రహాలు సామూహిక నిమజ్జనానికి బయలుదేరాయి. పాత మంగళగిరి సీతారామ కోవెల వద్ద బయలు దేరిన విగ్రహాలు వరుసగా బోసుబొమ్మ సెంటర్, హుస్సేన్ కట్ట, మార్కెట్, మిద్దె సెంటర్ మీదుగా గాలిగోపురం, గౌతమ బుద్ధ రోడ్, తిరిగి మిద్దె సెంటర్ మీదుగా తెనాలి ఫ్లైఓవర్ వరకు చేరుకుని అక్కడి నుంచి విజయవాడ వైపు కొన్ని, రేవేంద్రపాడు వంతెన వైపు కొన్ని విగ్రహాలు నిమజ్జనోత్సవానికి వెళ్లి అక్కడ విగ్రహాలను నిమజ్జనం చేశారు. జైబోలో గణేష్ మహారాజ్‌కి, గణపతి బప్ప మోరియా నినాదాలు, తప్పెట్లు, భజనలు, బ్యాండ్ మేళాలు, భక్తి గీతాలాపనలు, యువకుల ఈలలు, కోరింతలు,ఉత్సాహాల మధ్య శోభాయాత్ర ఉత్సాహంగా జరిగింది. పలుచోట్ల గణపతి చేతిలో పూజలందుకున్న లడ్డూల వేలంలతో పాటు మహిళలకు ముగ్గుల పోటీలు, బాలలకు వివిధ రకాల పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు ఇవ్వడం వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. దాతల సహకారంతో పలు వినాయక మండపాల వద్ద నిర్వాహకులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. మినీ ట్రాక్టర్లు, మినీ లారీలు, మినీ క్యారేజ్ లారీలలో గణనాధులను ఊరేగించారు. కారులో బుజ్జి వినాయకుడ్ని నిమజ్జనోత్సవానికి తీసుకువెళుతుండగా పలువురు ఆసక్తిగా తిలకించారు. సుమారు 70 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించినట్లు పట్టణ సీఐ వీరాస్వామి తెలిపారు.



జీఆర్ స్కూల్ వద్ద శోభాయాత్రలో నిమజ్జనానికి వెళుతున్న వినాయకుడు



కారులో నిమజ్జనోత్సవానికి బయలుదేరిన బుజ్జి గణపతి

అమెరికా పెత్తందారీ పోకడలను వ్యతిరేకించండి



నిరసన తెలియజేస్తున్న వామపక్షాల నాయకులు

తాడికొండ: అమెరికా పెత్తందారీ పోకడలను వ్యతిరేకించాలని కోరుతూ రాజధాని ప్రాంతమైన తుళ్లూరులో వామపక్షాలు నిరసన తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమానికి సీపీఎం గుంటూరు జిల్లా నాయకుడు ఎం.రవి, సీపీఐ తాడికొండ నియోజక వర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శంకరరావులు పాల్గొని మాట్లాడుతూ సామ్రాజ్య వాద దేశమైన అమెరికా పెత్తందారీ పోకడలను దేశ ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు. ట్రంప్ నియంతలా వ్యవహరిస్తూ భారతపై బెదిరింపుల కు దిగుతున్నాడని, భారత్ పై టారిఫ్‌లను 50 శాతం అదనంగా పెంచి ఇబ్బందులు పెడుతున్నాడన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే నెపంతో భారత్ మీద ప్రతీకార సుంకాలు విధించామని ట్రంప్ చెప్పటం దుర్మార్గమన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు పేరం బాబు రావు, కుంభ ఆంజనేయులు, షేక్ జానీ, బత్తుల వెంకటేశ్వరరావు, బెజ్జం గెరటయ్య, సీపీఐ నాయకులు కాబోతు ఈశ్వరరావు, గుర్రంకొండ సత్యానందం, తోకల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా టారిఫ్‌ల పెంపు దారుణం

మంగళగిరి టౌన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల మన దేశానికి చెందిన దిగుమతి సరుకులపై 50 శాతం సుంకాల పెంపు నిర్ణయాన్ని తీసుకోవడాన్ని ఖండిస్తూ వామపక్ష పార్టీలు శనివారం మంగళగిరి అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమెరికా నిర్ణయం వల్ల రాష్ట్రంలో ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్యల ధరలు గణనీయంగా పడిపోవడంతో తీరప్రాంత రైతులు ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లారని, గార్మెంట్స్ మిల్లులు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న వేలాది మహిళా కార్మికుల ఉపాధి ప్రమాదంలో ఉందని పేర్కొన్నారు. రైతులు, కార్మికులు నష్టపోతున్నా కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అంటూ మండిపడ్డారు. వామపక్ష నేతలు జాలాది జాన్‌బాబు, చిన్ని తిరుపతయ్య, కోట మాల్యాద్రి, వీవీ జవహర్‌లాల్, చిన్ని సత్యనారాయణ, పిల్లలమర్రి బాలకృష్ణ, జేవీ రాఘువులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో...

తాడేపల్లి రూరల్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెంచిన 50 శాతం సుంకాలను నిరసిస్తూ సిపిఎం రాజధాని నేతల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాన్ని ఉండవల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సామ్రాజ్యవాద దేశమైన అమెరికా పెత్తందారీ ధోరణితో భారత్‌పై పెత్తనం చేయాలని చూస్తే భారత పౌరులు ఎవరూ చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ సభ్యులుఎం. భాస్కరయ్య, గుంటూరు జిల్లా నాయకులు ఎం. రవి, తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిలోని రామయ్య కాలనీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు బూరగ వెంకటేశ్వర్లు మాట్లాడారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కంచర్ల కాశయ్య, వేముల దుర్గారావు, డివి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా సుంకాలను వ్యతిరేకించాలి

ఫిరంగిపురం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై విధించే సుంకాలను అందరూ వ్యతిరేకించి, దేశ ప్రయోజనాలు కాపాడాలని సీపీఎం నాయకులు అన్నారు. మండలకేంద్రం ఫిరంగిపురం, పొనుగుపాడు గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ శనివారం నిరసన కార్యక్రమాలు జరిగాయి. నిర్వహించారు. పార్టీ నాయకులు షేక్.మస్తాన్‌వలి, కె.కోటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



శ్యామలరావు మాస్టారును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు

మంగళగిరి టౌన్: మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీకే విద్యాసంస్థలలో 34 సంవత్సరాలు అధ్యాపకులుగా విశేష సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన అధ్యాపకులు డాక్టర్ కొసనం నాగ శ్యామల రావును సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వర రావు , కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ తాతారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంగళగిరి నగర పరిధిలోని ఎస్.ఎల్.ఎం. చైతన్య హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. విశ్రాంత హెచ్‌ఎంలు జగదావు కాశీరావు, డి.ఎస్.కె. శర్మలను ఘనంగా సత్కరించారు. జీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజి విశ్రాంత ఆచార్యులు వెనిగళ్ళ శ్రీనివాస్, విశ్రాంత తెలుగు అధ్యాపకులు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా చెత్త వాహనం ఉంచడం దారుణం



దుగ్గిరాల: దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామ అంగన్‌వాడీ కేంద్రం ఎదుట పంచాయతీ చెత్త వాహనం నిలపడం దారుణమని ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ పేర్కొన్నారు. శనివారం గ్రామంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు చిన్న పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకునే అంగన్వాడీ సెంటర్ ఎదురుగా పంచాయతీ వాహనం నిలిపి ఉంచడం వల్ల మిగిలిపోయిన వ్యర్థాలు దాని నుంచే దుర్గంధం, ఈగలు ముసరటం వల్ల అంటు రోగాలు వచ్చే అవకాశం ఉందని, ప్రాణాంతరకర వ్యాధులు రాకముందే జాగ్రత్త వహించాలని, ప్రభుత్వ అధికారులు, నాయకులు త్వరగా స్పందించి సమస్యని పరిష్కరించాలని ఆయన కోరారు.

చంద్రగ్రహణం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట చైతన్య తపోవన్, శ్రీ శివకేశవ పీఠంలో ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తపోవన్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రగ్రహణం రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 1.30 వరకు ఉందని, సదాశివుని సన్నిధిలో 10 గంటలకు సామూహిక సంకల్పం, మంత్ర జపం, 11 గంటలకు భస్మాభిషేకం, 12 గంటలకు బిల్వార్చన, 12.30 గంటకు ధ్యానము, 1 గంటకు నామ జపము, 1.30కు విరమణ కార్యక్రమాలు నిర్వహించనున్నామని, ఇంటికి వెళ్లలేని వారికి విడుపు స్నాన, విశ్రాంతి వసతి ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

తాడికొండ: ద్విచక్ర వాహనం చోరీపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఘటన మండల కేంద్రమైన తాడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకూరపాడు మండలం జలాల్‌పురం గ్రామానికి చెందిన పాటిబండ్ల స్వామి జ్వాన్ 15వ తేదీన తాడికొండ గురుకుల పాఠశాలలో చదువుతున్న పిల్లలను చూసేందుకు బంధువులతో కలిసి వచ్చాడు. వాహనాన్ని గురుకుల పాఠశాల ఎదుట పార్క్‌చేసి వెళ్లి తిరిగి వచ్చి చూసే సరికి కనిపించలేదు. దీనిపై బాధితుడు తాడికొండ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ముగిసిన అర్ధచాతుర్మాస వ్రతదీక్షలు

తెనాలి: సాలిగ్రామం మఠం ఆధ్వర్యంలో స్థానిక గంగానమ్మ పేటలోని ది కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరుగుతున్న పెనుగొండ పీఠాధిపతి శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామీజీ అర్ధ చాతుర్మాస వ్రతదీక్షా మహోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం పట్టణంలో కోలాహలంగా స్వామీజీ శోభాయాత్రను నిర్వహించారు. మేళతాళాలు, కోలాటం, భక్తి కీర్తనలతో యాత్ర కొనసాగింది. సాలిగ్రామ మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, పల్లిపోతు మురళీ మనోహర్, పెనుగొండ వెంకటేశ్వరరావు, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, లోకనాధం, సాలిగ్రామ మఠం సభ్యులు, శ్రీవిద్యాపీఠం సభ్యులు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా రుక్మిణీ కల్యాణం



కొల్లూరు: భాగవత సప్తాహ మహోత్సవంలో భాగంగా రుక్మిణీ కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కొల్లూరు శ్రీ పార్వతీ సంస్కృత పాఠశాలలో శంకర సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 109వ శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నైషధం వెంకటమూర్తి, మంజుల దంపతులతో రుక్మిణీ కల్యాణం మహోత్సవాన్ని కొత్తా రాజేష్ శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని వివాహాలు, నరకోద్ధరణం, నృగోపాఖ్యానం, కుచేలోపాఖ్యానం తదితర సప్తాహాలు నిర్వహించినట్లు శంకర సేవా సమితి సభ్యులు కల్లూరు వెంకట సూర్యనారాయణమూర్తి తెలిపారు.

'అన్నదాత పోరు'ను జయప్రదం చేయండి

వైఎస్సార్ సీపీ నాయకులు



లాం గ్రామంలో సమాయత్త సమావేశంలో పాల్గొన్న నాయకులు

తాడికొండ: అన్నదాతల యూరియా అవస్థలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న అన్నదాత పోరును జయప్రదం చేసేందుకు రైతు సోదరులను సమాయత్తం చేసి నాయకులు భారీగా తరలిరావాలని వైఎస్సార్ సీపీ తాడికొండ మండల అధ్యక్షుడు వంగా పోలారెడ్డి, మాజీ అధ్యక్షుడు ముప్పాళ్ళ మనోహర్ అన్నారు. శనివారం తాడికొండ మండలం లాం, మోతడక, రావెల, బేజాత్పురం, బండారుపల్లి, దామరపల్లి గ్రామాల్లో సమాయత్త సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా నేడు కూటమి ప్రభుత్వంలో అన్నదాతలు బస్తా యూరియా కోసం బారులు తీరాల్సిన పరిస్థితి రావడం దుర్మార్గం అన్నారు. ఈ సమయంలోనే రైతులకు అండగా నిలవాల్సిన అవసరం మనపై ఉందని, బాధ్యతగా ప్రతి ఒక్కరూ అన్నదాతల సమస్యలపై గర్జించేందుకు ఈ నెల 9వ తేదీన గుంటూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించే అన్నదాత పోరును జయప్రదం చేసేందుకు భారీగా తరలిరావాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు నల్లిబోయిన శ్రీనివాసరావు, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు అందజేస్తున్న సిబ్బంది

ఫిరంగిపురం: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్నారు. మండల కేంద్రంలో మహిళ మండల సమాఖ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా మాస్టర్ ట్రైనర్ చింతా వరప్రసాద్, మోడల్ మేకర్ ఇర్ల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన చిరు ధాన్యాలు, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఏపీఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తమ ఇంటి పెరట్లో పలురకాల కూరగాయలు, ఆకు కూరలు వంటివి ఏర్పాటు చేసుకొని వాటిని తగిన విధంగా పెంచుకొని వాటిని ఆహారంగా తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. హెల్త్ అండ్ న్యూట్రీషన్ ఎన్ఎఫ్ఎఫ్ రజని, సీఆర్పీలు శాంతకుమారి, లావణ్య, అరుణ, యూనిట్ ఇంచార్జి తిరుపతిరావు, మహిళ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



ప్రసంగిస్తున్న కొమెర అంకారావు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో శనివారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కొమెర అంకారావు విచ్చేసి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి చిన్న మార్పు, పెద్ద ఫలితాలకు దారితీస్తుందన్నారు. ఇంట్లో నుంచి ప్రకృతి సంరక్షణ ప్రారంభించాలని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా అటవీశాఖ అధికారిణి ఎం.హిమ శైలజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మన చుట్టూ ఉన్న పర్యావరణం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. వనరులను కలుషితం చేయకుండా ప్రతి ఒక్క సామాజిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు. తాడేపల్లి తహసీల్దారు డి. సీతారామయ్య మాట్లాడుతూ ప్రస్తుతం అభివృద్ధి పేరుతో జరుగుతున్న భారీ నిర్మాణ వాతావరణ కలుషితం వలన నదులు, సముద్ర జీవరాసులు పెద్ద ఎత్తున చనిపోతున్నాయని అన్నారు. రాబోయే భవిష్యత్తు తరాలకోసం స్వచ్ఛమైన గాలిని, నీటిని అందించగలిగితే అదే అసలైన అభివృద్ధిగా పరిగణించాలని తెలిపారు. కెఎల్‌యూ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణంపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వన్ ఎర్త్ వన్ లైఫ్ వ్యవస్థాపకురాలు లీలాకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం ఆకుకూరలు, కూరగాయలు పురుగుల మందులు లేకుండా ఉత్పత్తి చేసేందుకు మిద్దె తోటలను విజయవాడ వేదికగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. వర్శిటీ కార్యదర్శి కోనేరు శివకాంచనలత, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్, వన్ ఎర్త్ వన్ లైఫ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తొగటి వీర క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి తదితరులు

మంగళగిరి టౌన్: తొగటి వీర క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ విషయంపై టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతిపత్రం సమర్పించడం జరిగిందని పేర్కొన్నారు. చేనేత కులంలో తమ సామాజికవర్గంవారు కీలకంగా ఉన్నారని అన్నారు. కార్పొరేషన్ కోసం ఐక్యంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని, సామాజిక వర్గ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, పలు జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిల వసూళ్లు వేగవంతం చేయాలి

- వ్యవసాయ, సూర్య ఘర్ కనెక్షన్‌ల పెంపునకు చొరవ చూపాలి
- ఏపీసీపీడీసీఎల్ తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చిరంజీవి



మాట్లాడుతున్న చిరంజీవి

తెనాలిటౌన్: తెనాలి డివిజన్ పరిధిలోని విద్యుత్ బకాయిల వసూళ్లు వేగవంతం చేయాలని ఏపీసీపీడీసీఎల్ తెనాలి డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి.చిరంజీవి అధికారులను ఆదేశించారు. స్థానిక చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయంలో శనివారం డివిజన్ పరిధిలోని అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు పెంచాలని, ప్రధానమంత్రి, సూర్యఘర్ పథకానికి సంబంధించి కనెక్షన్‌లు పెంపు మరింత వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రూ.2లక్షల ఖర్చు అయ్యే ఈ పథకానికి సంబంధించి లక్ష రూపాయిలు వరకు రుణ సౌకర్యం లభిస్తుందని చెప్పారు. ఇళ్లకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. మీటరు ద్వారా లైన్‌లోకి వచ్చే కరెంట్‌కు విద్యుత్‌శాఖ గృహ వినియోగదారులకు నగదు చెల్లిస్తుందని స్పష్టం చేశారు. సౌర విద్యుత్ వినియోగం వలన గణనీయంగా విద్యుత్ బిల్లు తగ్గుతుందని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా నిర్దేశించిన ఏజెన్సీ ద్వారా సోలార్ ప్యానల్స్ బిగించి సూర్యఘర్ పథకం కింద అర్హులుగా చేర్చుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే అర్హులను గుర్తించి జాబితా తయారు చేశామని వెల్లడించారు. లబ్ధిదారులకు పక్కా ఇల్లు ఉండాలని, అంగీకారపత్రం ఇస్తే సంబంధించి కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా ప్యానల్స్ బిగిస్తామని వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం రాయితీగా అందించే 200 లోపు ఉచిత విద్యుత్ వినియోగానికి స్థానిక సచివాలయంలో సంప్రదించాలని కోరారు.